క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి



మరికల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట పెట్టుబడి సాయం కింద పీఎం కిసాన్, రైతుబంధు రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తే బ్యాంకర్లు రుణాల కింద తీసుకోవడం సరికాదని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ రాంకోటికి వినతి పత్రం అందజేశారు. రైతులను వేధిస్తున్న బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరేష్‌గౌడ్, ఆంజనేయులు,కృష్ణయ్య, రమేష్‌లు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



మరికల్: సీఐగా బాధ్యతలు చేపట్టిన రాజేందర్‌ను శుక్రవారం నారాయణపేట ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి మరికల్ సర్కిల్ కార్యాలయంలో సీఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అదేవిధంగా కొండాపూర్, హన్మన్‌పల్లి, ధన్వాడ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భగవంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాగిరెడ్డిలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మరికల్: సీజనల్ వ్యాధులపై పీహెచ్‌సీ సిబ్బంది, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని పెద్ద చింతకుంటలో ఇంటింటికి తిరిగి నిల్వ ఉన్న నీటిని పారబోశారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, విషజ్వరాలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బురదలో వరినాట్లు వేసి నిరసన



మరికల్: ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా వర్షాలకు రహదారులు బురదగా మారాయని ఆరోపిస్తూ శుక్రవారం స్థానికులు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని 7, 8 వ వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీరోడ్లతో పాటు, డ్రెయినేజీలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన లింగగారి స్వప్నరెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యురాలి పదవికి, బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేశారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియంతృత్వ పోకడకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

రేలింగ్ ఏర్పాటుకు విరాళం



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం సమీపంలో గల లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం అవసరమైన క్యూ లైన్ రేలింగ్ ఏర్పాటుకు భక్తుడు రూ.50 వేలు విరాళం అందజేశారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు లయన్స్‌క్లబ్ కోశాధికారి రవికుమార్‌గౌడ్ చెక్కు అందజేశారు. అనంతరం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సోమశేఖరస్వామి, కమిటీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భయం.. భయంగా!

- పెచ్చులూడుతున్న పైకప్పు
- శిథిలావస్థలో ప్రభుత్వ ఆస్పత్రి



వర్షపునీరు కింద పడకుండా ఏర్పాటు చేసిన బకెట్



ప్రభుత్వ ఆస్పత్రి జనరల్ వార్డులో పెచ్చులూడిన పైకప్పు

నారాయణపేట రూరల్: వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగుల కష్టాలు అంతాఇంతా కాదు. అసలే ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వస్తే మరో రోగం తెచ్చుకొని ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. నాసిరకంగా ఆస్పత్రి నిర్మించడంతో అతి తక్కువ కాలంలోనే శిథిలాస్థకు చేరుకుంది. చాలా గదులు, వరండాలో పైకప్పు పెచ్చులు ఊడిపోతుంది. వర్షాలకు గోడలు తంపుపట్టడంతో పాటు పైనుంచి ఉరుస్తుంది. దీంతో గదులన్ని వర్షపునీటితో నిండాయి. వరండా సైతం అదేవిధంగా మారింది. దీంతో అక్కడ వైద్య సేవలు అందించడం కష్టంగా మారడంతో అత్యవసర సేవల విభాగం (ఐసీయూ)ను పాతబస్టాండ్‌లోని చిన్నపిల్లల ఆస్పత్రికి మార్చారు. అక్కడి సామగ్రి, ఫ్యాన్లు, మంచాలను గదుల్లో భద్రపరిచారు. ఇక సాధారణ సేవల విభాగాలకు సంబంధించిన గదుల్లో సైతం చెత్తు పెచ్చులు ఊడిపోతున్నాయి. రోగులు ప్రమాదకరమైన చోట్ల భయంతో బిక్కు బిక్కుమంటు ఉంటున్నారు. ఓపీ సమీపంలో, ఆపరేషన్ గది ముందు నీటి దారలు పడుతుండటంతో బకెట్లు ఏర్పాటు చేశారు. ఇక మొదటి అంతస్తులో ఒక గది తప్పా మిగితావి నిరుపయోగంగా ఉన్నాయి. ఎప్పుడు కూలుతాయో అనే భయంతో వాటిని ఖాళీ చేశారు. బయట భాగంలోను వాననీటితో బురదమయంగా మారింది. దోమలు, ఈగలతో పాటు పందులు, కుక్కలు సైతం పరిసరాల్లో తిరుగుతున్నాయి. ఇక్కడి వచ్చే రోగులకు వారికి ఉన్న జబ్బులకు అధనంగా రోగాలను వెంట తీసుకుని పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రోగుల సహాయకుల కోసం ఇటీవల రేకుల షెడ్డు నిర్మించారు. అక్కడ అపరిశుభ్రత నెలకొండటంతో ఉండేందుకు వీలు కావడం లేదు. ఇలా జిల్లా ఆస్పత్రి అవస్థల నడుమ కొనసాగుతుంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఐసీయూను ప్రస్తుతం చిల్డ్రన్ ఆస్పత్రికి మార్చాం. గర్భిణులు కాన్పుల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నాం. కొత్త భవనం నిర్మిస్తే సమస్యలు తీరుతాయి.

– డాక్టర్ రంజిత్, సూపరింటెండెంట్

ఘనంగా మొహర్రం వేడుకలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



పీర్లను దర్శించుకుంటున్న శివకుమార్‌రెడ్డి

ఊట్కూర్: మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం ఉత్సవాలు శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభమయ్యాయి. హసేన్, హుసేన్ పీర్ల సవారి సందర్భంగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేకలు, గొర్రెలతో ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. ట్రాక్టర్లు, ఆటో, ఎద్దుల బండ్లలో వచ్చిన భక్తులు తరలివస్తున్నారు. శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి హసేన్, హుసేన్ పెద్దపీర్లను గ్రామంలో ఊరేగిస్తు ఉదయం 9 గంటల వరకు ఆశుర్‌ఖానకు చేరుకుంటాయి. సాయంత్రం 5 గంటల నుంచి పీర్లను గ్రామంలో ఊరేగిస్తు రాత్రి 10 గంటల ప్రాంతంలో పెద్దచెరువు అలుగుపై నిమజ్జనం చేస్తారు. ముంబాయి, పూణె, సొలాపూర్, బెంగళూర్, హైదరాబాద్ తదితర పట్టాణాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. చిరు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాంలాల్, ఎస్‌ఐ గోకరె ఉన్నారు.

నారాయణపేట టౌన్: కులమతాలకు అతీతంగా పండుగ జరుపుకోవాలని, మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ అని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తకీబాబా దర్గా, పీర్ల చావిడీలో ప్రతిష్ఠించిన పీర్లను ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి సయ్యద్‌గాయసుద్దీన్ ఖాద్రి, కౌన్సిలర్ ఎండీ సలీం, కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహిమూద్ ఖురేషి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు రహమాన్ చాంద్, జలీల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

నారాయణపేట రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న శిబిరానికి ఐఎఫ్‌టీయూ నాయకుడు నర్సింహా చేరుకొని వారికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్మికుల డిమాండ్లు నెరవేర్చడంతో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

మత్తడి దూకిన గున్ముక్ల చెరువు



ధన్వాడ: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు నిండుకుండలా తలపిస్తున్నాయి. కొన్ని చెరువులు పూర్తిగా నిండి జలకళ సంతరించుకుంది. ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామ చెరువు శుక్రవారం అలుగు దూకుతోంది. చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు పారడంతో గ్రామస్తులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు పంట నష్టం చెల్లించాలి



మక్తల్‌లో వ్యవసాయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వాకిటి శ్రీహరి

మక్తల్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. పంట నష్టం అంచనా వేసి ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములు, నారాయణ, నూరోద్దీన్, రవికుమార్, మందుల నరేందర్, గంగాధర్, గోవర్ధన్, అసముద్దిన్, ఓబులేస్, వెంకటేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మాగనూర్(కృష్ణ): కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామ పంచాయతీలోని వాసునగర్ దగ్గర కృష్ణానది ప్రవాహ ఉధృతిని నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పరిశీలించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణ మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు మరమ్మతు చేయాలని నిరసన

కృష్ణానదిపై ఉన్న పురాతన వంతెన(ఎన్‌హెచ్-167) శిథిలావస్థకు చేరుకుందని అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాలను కలిపే వంతెనను ఆయన సందర్శించారు. అనంతరం వంతెలనపై ఆయన నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాజప్పగౌడ, నర్సింహులు, కృష్ణమూర్తి, నాగేందర్, కల్లూరి గోవర్ధన్, ఓబులేష్, అన్వర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిపై ఫిర్యాదు



దామరగిద్ద: విత్తనాలను పక్కదారి పట్టిస్తున్నాడని ఆరోపిస్తూ మండల వ్యవసాయ అధికారిపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సంబంధిత జిల్లా అధికారికి బీజేవైఎం నాయకుడు ఆంజనేయులు గౌడ్ రైతులతో కలిసి ఫిర్యాదు చేశాడు. మండలానికి టీఎస్ సీడ్ కార్పొరేషన్ ద్వారా 100 క్వింటాళ్లకు పైగా కంది విత్తనాలు సరఫరా చేస్తే ఎనిమిది క్లస్టర్ కేంద్రాల పరిధిలో ఒక్కో క్లస్టర్‌కు 2.5 క్వింటాళ్లు మాత్రమే అందించాడని వివరించారు. ఏఓపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు రంగయ్యగౌడ్, లక్ష్మీనారాయణ, రమేష్, శేఖర్ ఉన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి



పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

మరికల్: వరుసగా కురుస్తున్న ముసురు వర్షాల వల్ల శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని తహసీల్దార్ రాంకోటి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను, పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు. పాత ఇళ్లలో నివాసం ఉంటున్న 10 ఇళ్లను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని వారిని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామస్తులు సమీపంలోని వాగు వద్దకు వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలు ముట్టుకోవద్దని పేర్కొన్నారు. ఎంపీఓ బాలాజి, ఆర్‌ఐ శ్రీశైలం, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, శంకరయ్యలు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడటం సరికాదు



దీక్ష శిబిరంలో సాధన సమితి నాయకులు

నారాయణపేట రూరల్: కోటకొండను మండలం చేయాలని ప్రశ్నిస్తున్న గొంతుకలను అధికారపార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడటం సరికాదని సాధన సమితి నాయకులు హెచ్చరించారు. మండలంలోని కోటకొండలో 80వ రోజు శుక్రవారం సాధన సమితి సభ్యులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు. దీక్షల్లో పాల్గొంటున్న వారిని బెదిరిస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో యాదగిరి, చెన్నప్ప, రాజు, ప్రవీణ్, నర్సిరెడ్డి, శివకుమార్, జనార్దన్, కాశన్న, బాలకృష్ణ, వెంకట్రాములు పాల్గొన్నారు.

39 స్పోర్ట్స్ కిట్లు



మండలానికి చేరుకున్న స్పోర్ట్స్ కిట్లు

కోయిల్‌కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో 39 క్రీడా ప్రాంగణాలు పూర్తయ్యాయని, వాటికి స్పోర్ట్స్ కిట్లు వచ్చాయని ఎంపీడీఓ జయరాములు శుక్రవారం తెలిపారు. త్వరలోనే పంపిణీ చేస్తామని వివరించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నేర నియంత్రణకు చర్యలు



నర్వ: నేర నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ కె.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ రికార్డులను తనిఖీ చేశారు.అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కేసులు పెండింగ్‌లో ఉండకుండా చూసుకోవాలని సూచించారు. డయల్ 100 కాల్స్ వచ్చిన వెంబడే తక్షణమే స్పందించాలన్నారు. ప్రతి నిత్యం జీడీ ఎంట్రీ, సిబ్బందికి రోల్‌కాల్స్ నిర్వహించాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించి, ఏర్పాటుకు కృషి చేయాలని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన వెంబడి మరికల్ సీఐ రాజేందర్, నర్వ ఎస్‌ఐ సీహెచ్ కురుమయ్య తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



లక్ష్మీపల్లిలో పంచాయతీ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండా, లక్ష్మీపల్లి, సమస్తాపూర్ గ్రామాలలో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 500 ఓటర్లు కలిగిన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మక్తల్ నియోజకవర్గంలో నూతనంగా 41 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు, కల్వర్టులు, సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్ కుమార్ గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, రైతుబంధు మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్, దేవమ్మ, మాణిక్యమ్మ, ఎంపీటీసీ రాఘవరెడ్డి, విజయలక్ష్మి, నాయకులు సురేశ్, గోపాల్‌రెడ్డి, శివనాయక్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

నర్వ: పేదల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని నాగిరెడ్డిపల్లి, సీపూర్ గ్రామాల్లోని నిరుపేదలకు ఒక్కొక్కరికి 75 గజాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు ఆయన అందించారు. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 102 మంది, సీపూర్‌కు చెందిన 175 మందికి డిప్ సిస్టం ద్వారా ఎంపిక చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజగణేష్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఎంపీపీ జయరాములుశెట్టి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, దండు అయ్యప్ప, డా.శంకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానంతోనే న్యాయం



పోస్టరును విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మద్దూరు: సీపీఎస్ రద్దు చేస్తూ ప్రభుత్వం పాత పింఛన్ విధానంతోనే న్యాయం జరుగుతుందని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం చేపట్టిన సంకల్పయాత్ర పోస్టర్‌ను తహసీల్దార్ జయరాములు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. అనంతరం శేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం శనివారం జిల్లా కేంద్రంలో సంకల్ప యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ యాత్రకు ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ, తపస్, సీపీఎస్ నాయకులు సంతోష్, భాస్కర్, నర్సప్ప, విజయ్‌రెడ్డి, రవికుమార్, రవి, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఓపీఎస్ సాధన రథయాత్ర

నారాయణపేట రూరల్: రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16న ప్రారంభమైన ఓపీఎస్ సాధన సంకల్ప రథయాత్ర శనివారం నారాయణపేట జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని సీపీఎస్ సంఘ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహం దగ్గర 4 గంటలకు ర్యాలీ ప్రారంభమై చౌక్‌సెంటర్, వీర సావర్కర్‌చౌరస్తా, సత్యనారాయణసర్కిల్, బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు చేరుకుంటుందన్నారు. దీనికి జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తి మద్దతు తెలిపి విజయవంతం చేయాలని ఆయన కోరారు. 2003తర్వాత సర్కారు కొలువులను పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంతో చాలా నష్టపోతున్నారని, పాత పెన్షన్ విధానం అమలు చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. అదేవిధంగా ఆగస్టు 12న హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ ఉంటుందని పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు

సీపీఎస్ రద్దు కోసం పోరాటం చేస్తు ఏర్పాటు చేసిన ఓపీఎస్ సాధన సంకల్ప రథయాత్రకు పీఆర్‌టీయూ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న సీపీఎస్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

31న బహిరంగ సభ



మాట్లాడుతున్న రతంగపాండురెడ్డి

నారాయణపేట రూరల్: పాలమూరు జిల్లా కేంద్రంలో ఈ నెల 31న నిర్వహిస్తున్న బహిరంగసభకు కేంద్రమంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరవుతున్నారని స్థానిక నాయకులు రతంగపాండురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండోసారి అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత తొలిసారి ఉమ్మడి జిల్లా కేంద్రానికి వస్తున్నారని, నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కేసీఆర్ పాలనపై ప్రజలు విసుగుచెంది ఉన్నారని, పాలమూర్-రంగారెడ్డి పథకం అవినీతితో కూడుకున్నదని విమర్శించారు. జీఓ 69 అమలులో నిర్లక్ష్యాన్ని ఎండగడదామన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో ప్రభాకరవర్ధన్, బాలింగం, నర్సన్‌గౌడ్, లక్ష్మి, గోవర్దన్, వెంకటయ్య, రఘురామయ్యగౌడ్, సత్యనారాయణ, సురేందర్, భాస్కర్, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎంపీపీ సస్పెండ్

మద్దూరు: బీఆర్‌ఎస్ ఉమ్మడి మండల మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ లింగగారి లక్ష్మీనారాయణ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో క్రమశిక్షణరాహిత్య చర్యలో భాగంగా అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వివరించారు. ఇదే విషయంపై లక్ష్మీనారాయణరెడ్డి వివరణ కోరగా ఉమ్మడి మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసినా పార్టీ గుర్తించలేదని, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియంతృత్వ ధోరణి అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతానని ఆయన పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కోయిల్‌కొండ: కొత్లాబాద్ సీతరామాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి భారతమ్మ రాములుగౌడ్ జ్ఞాపకార్థం కృష్ణయ్యగౌడ్, మల్లికార్జున్‌గౌడ్‌లు రూ.లక్షా నూట పదహారు, అదేవిధంగా కాశీపతిచారి రూ. లక్షా పదహారు, బాలవర్ధన్‌రెడ్డి రూ.50వేలు, టంకరి రవిగౌడ్ రూ.50వేలు, ఆనంద్‌గౌడ్ రూ.50వేలు విరాళంగా శుక్రవారం అందించారు.